# 2322 నర్సింగ్ పోస్టుల భర్తీ కొనసాగుతోంది

## ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**అందోల్, మే 12 సిరి న్యూస్:**
గతేడాది 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేశామని, మరో 2322 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నర్సింగ్ ఆఫీసర్లకు ఒక ప్రకటనలో మంత్రి దామోదర రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యుల కంటే ఎక్కువగా, నర్సులే రోగులకు సేవలు అందిస్తున్నారని, కోట్ల మంది పేషెంట్ల ప్రాణాలు కాపాడటంలో కీలక పాత్రను పోషిస్తున్నారని మంత్రి కొనియాడారు. ప్రభుత్వ వైద్య రంగంలో నర్సింగ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రెండేండ్లలోనే 9 వేలకుపైగా పోస్టులను భర్తీ చేసి, ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నర్సులకు ఉద్యోగావకాశాలు కల్పించామని పేర్కొన్నారు. దేశ, విదేశాల్లో నర్సింగ్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, 16 ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలను ఇక్కడి యువతకు అందుబాటులోకి తీసుకొచ్చామని స్పష్టం చేశారు. గ్రామీణ యువతులను నర్సులుగా తీర్చిదిద్ది, దేశ విదేశాల్లో వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్లకు ప్రమోషన్లు ఇచ్చి, వారి ఆకాంక్షలను నెరవేర్చామని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులోనూ నర్సింగ్ ఆఫీసర్లకు అండగా ఉంటామని, వారి న్యాయమైనడిమాండ్లను నెరవేర్చేందుకు ప్రయత్నిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ హాస్పిటళ్లకు వచ్చే పేషెంట్లకు సేవలు అందిస్తున్న నర్సులకు మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఎంతో మంది నర్సులు పేషెంట్లతో ప్రేమగా మాట్లాడి, వారికి మనో ధైర్యాన్ని కల్పిస్తున్నారని, అలాంటి నర్సులను మిగతా వారు కూడా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఒత్తిడి, బాధలో ఉంటారని, అలాంటి వారితో ఒక్కమాట ప్రేమగా మాట్లాడితే ఎంతో ఉపశమనం పొందుతారని మంత్రి గుర్తు చేశారు. నర్సుల పని ఒత్తిడిని పేషెంట్లు, అర్థం చేసుకుని, సహకరించాలని మంత్రి కోరారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధి హామీ కూలీలు మృతి

## మరొకరికి తీవ్ర గాయాలు

**దుబ్బాక, మే 12 సిరి న్యూస్:**
కారు డ్రైవర్ నిర్లక్ష్యానికి ఇద్దరు ఉపాధి హామీ కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రగాయాలతో దవాఖాన పాలైన విషాద ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట–భూంపల్లి మండలం పోతారెడ్డిపేటలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతారెడ్డిపేటకు చెందిన బ్యాగరి చంద్రవ్వ (45), గోప దేవవ్వ(48), బైండ్ల లాస్యలతో పాటు మరికొందరు మహిళలు ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. సిద్దిపేట–రామాయంపేట రోడ్డు పోతారెడ్డిపేటలో ఎదురుగా అతి వేగంగా వస్తున్న కారు వారిని ఢీకొట్టింది. దీంతో బ్యాగరి చంద్రవ్వ (45), గోప దేవవ్వ (48) అక్కడికక్కడే మృతిచెందారు. మరో మహిళ బైండ్ల లాస్యకు తీవ్రగాయాలు కావడంతో ఆమెను చికిత్స కోసం సిద్దిపేట దవాఖానకు తరలించారు.బెల్లంపల్లికి చెందిన బాల్కీకి తన నానమ్మతోకలిసి కారులో మెదక్‌లో జరిగే పెండ్లికి వెళ్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా ఎదురుగా వస్తున్న ఉపాధిహామీ కూలీలకు ఢీకొట్టాడు. డ్రైవింగ్ చేస్తున్న బాల్కీకిపై కేసు నమోదు చేసి, మృత దేహాలను పోస్టుమార్టం కోసం దుబ్బాక సర్కారు దవాఖానకు తరలించినట్లు భూంపల్లి ఎస్సై హరికృష్ణ తెలిపారు.ం

# భక్తితో పులకించిన రామతీర్థం

## కళ్యాణానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి

**పాపన్నపేట, మే 12 సిరి న్యూస్**



మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ శాసనసభ్యురాలు పద్మదేవేందర్ రెడ్డి పాపన్నపేట మండల పరిధిలోని ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థంలో జరిగిన శ్రీ బీరప్ప స్వామి, కామరాతి దేవిల కళ్యాణోత్సవం కార్యక్రమం కు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. కురుమ సంఘం ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, బీరప్ప స్వామి, కామరాతి దేవిల దివ్య కళ్యాణ మహోత్సవం కన్నుల పండువలా జరగడం ఎంతో సంతోషకరమని అన్నారు.అనంతరం, కురుమ సంఘం నాయకులు పద్మ దేవేందర్ రెడ్డిని ఘనంగా గొంగడి తో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్‌లు బాలగౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, రామతీర్థం మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్, బద్రి మల్లేశం, ప్రముఖ నాయకులు బాబా గౌడ్, సాయిరెడ్డి, దుర్గయ్య, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

# పద్మాదేవేందర్ రెడ్డికి ఆహ్వానం

**చిన్న శంకరంపేట్, మే 13 (సిరి న్యూస్):**



చిన్న శంకరంపేట్ మండలం అంబాజీపేట గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన నూతన రేణుక మాత ఆలయంలో ఈనెల 16, 17, 18, 19, 20 తేదీలో జరిగే రేణుక మాత సిద్ధయోగానికి, రేణుక మాత జమదగ్ని కళ్యాణ మహోత్సవానికి మెదక్ జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డిని అంబాజీపేట గౌడ సంఘం నాయకులు ఆహ్వానించారు . ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పట్లోరి రాజు, పూజారి సంగమేశ్వర్ , గౌడ సంఘం నాయకులు సుంకరి చంద్ర గౌడ్, కొమరవెల్లి మల్లేష్ గౌడ్, కోదూరి రాజా గౌడ్, సుంకరి ఎల్ల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యలను సత్వరం పరిష్కారించాలి

**సిద్దిపేట, మే12 సిరి న్యూస్:**



ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార చూపాలని కలెక్టర్ ఎం.మను చౌదరి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ...సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారన్నారు.అధికారులు ఆయా శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 49 ఫిర్యాదులను వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ నాగ రాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

**జహీరాబాద్, మే 12 సిరిన్యూస్:**
: ఉపాధి హామీ పనులు చేస్తుండగా గుండెపోటుతో మహిళా కూలీ మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని రాయిపల్లి(డి)లో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఏర్రోల కమలమ్మ తోటి కూలీలతో కలిసి గ్రామ శివారులో పనులు చేసేందుకు వెళ్లింది.పనులు చేస్తున్న క్రమంలో ఆమెకు ఒక్కసారిగా చాతీలో నొప్పి రావడంతో కింద పడి పోయింది. అక్కడే ఉన్న ఉపాధి హామీ ఎఫ్ఏ అనంతరామ్ కూలీల సహాయంతో వెంటనే జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆమెకు వైద్యాధికారులు పరీక్షలు చేస్తున్న క్రమంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మండల ఉపాధి హామీ ప్రాజెక్టు అధికారి అశోక్‌కుమార్ దవాఖానకు వెళ్లి ఘటనకు సంబంధించిన వివ రాలను అడిగి తెలుసుకున్నారు. మృతిరాలి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు.